

35 మంది అభ్యర్థులు.. 38 నామినేషన్లు

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తొలి విడత ఎన్నికలు జరిగే 14 లోక్‌సభ నియోజకవర్గాల్లో నామినేషన్ల దాఖలుకు మరో రెండు రోజులు మాత్ర మే గడువు ఉండడంతో పోటాపోటీగా దాఖలయ్యాయి. మంగళవారం 35 మంది అభ్యర్థులు 38 నామినేషన్ల సెట్లను దాఖలు చేశారు. వీరిలో 31 మంది పురుషులు 33 నామినేషన్‌లు దాఖలు చేయగా, నలుగురు మహిళలు ఐదు నామినేషన్లు సమర్పించారు. ఇప్పటి వరకు 127 మంది నామినేషన్లు వేశారు. అత్యధికంగా చిక్కబళ్లాపుర నుంచి 15 మంది నామినేషన్‌లు వేయగా, అత్యల్పంగా కోలారు నుంచి నలుగురు మాత్రమే నామినేషన్ వేశారు.

పోలింగ్ శాతం పెంచితే

విజయం మనదే

- పార్టీ వర్గాలకు అమిత్‌షా పిలుపు
- చెన్నపట్టణలో ఉత్సాహంగా రోడ్‌షో



సమావేశం ప్రారంభంలో అమిత్‌షా తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ శాతం పెంచితే విజయం సునాయాసమవుతుందని, ఆ దిశగా శక్తి కేంద్రం కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. ఒక రోజు రాష్ట్ర పర్యటనలో భాగంగా అమిత్‌షా బిజీగా గడిపారు. మంగళవారం ఉదయం బీజేపీ, జేడీఎస్ ముఖ్యనేతల అల్పాహార విందులో కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం బెంగళూరు గ్రామీణ, సెంట్రల్, దక్షిణ, ఉత్తర, చిక్కబళ్లాపుర నియోజకవర్గాల శక్తికేంద్రం ప్రముఖులతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం మైసూరు, దావణగెరె, చామరాజనగర నియోజకవర్గాల శక్తికేంద్రాల ప్రతినిధుల సభలో భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశం, పదేళ్లలో ఆయన సాధనలు, కాంగ్రెస్ పాలనలో అవినీతి, కుంటుపడిన అభివృద్ధిపై ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ పట్ల విశ్వాసంతో ఉన్నారని, అందరిచేత ఓటు వేయిస్తే విజయం సులభమవుతుందన్నారు. 2014లో 43 శాతం ఓట్లతో 17స్థానాల్లో విజయం సాధ్యమైందని, 2019లో 51శాతంతో 25 స్థానాలు సాధించినట్టు తెలిపారు. నరేంద్రమోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ఎక్కడా అవినీతి ఆరోపణలు ఎదుర్కొనలేదని వివరించారు. కాంగ్రెస్ పాలనలో కామన్వెల్త్, 2జీ, మంత్రుల క్వార్టర్స్, జమ్ము-కశ్మీర్, అగస్త హెలికాప్టర్ వంటి అవినీతితో రూ.12 లక్షల కోట్ల కుంభకోణం చేశారన్నారు.

దేశంలో చారిత్రాత్మకమైన ప్రగతి నరేంద్రమోదీ పదేళ్లపాలనతో సాగిందన్నారు. 12 కోట్ల శౌచాలయాలు, 10కోట్ల మందికి గ్యాస్, 4 కోట్ల ఇళ్లు నిర్మించారని తెలిపారు. రూ.5లక్షల దాకా ఆరోగ్యబీమా సాధ్యమైందన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేశామన్నారు. 500 ఏళ్లుగా గుడారంలో ఉన్న శ్రీరాముడికి భవ్యమైన రామమందిరం నిర్మించామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. యూపీఏ పదేళ్ల పాలనలో 1.40 లక్షల కోట్లు గ్రాంటు ఇవ్వగా, మోదీ పాలనలో 4.19 లక్షల కోట్లు ఇచ్చామన్నారు. బీజేపీ నేత యడియూరప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తోందని, అభివృద్ధి కుటంపడిందని ఇది పాలనావైఫల్యానికి నిదర్శనమన్నారు. నరేంద్రమోదీని అభ్యర్థిగా భావించి గెలిపించాలన్నారు.



రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, మాజీ సీఎం సదానందగౌడ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, గోవిందకారజోళ సహా పలువురు పాల్గొన్నారు. అభ్యర్థులు సుధాకర్, శోభాకరంద్లాజె, డాక్టర్ సీఎస్ మంజునాథ్, పీసీ మోహన్, తేజస్వి సూర్యతో కలసి శంఖారావం పూరించారు. చెన్నపట్టణలో రోడ్‌షోకు భారీగా జనం చేశారు.



చెన్నపట్టణ రోడ్‌షోలో అమిత్‌షా, కుమారస్వామి, విజయేంద్ర తదితరులు



ఎన్నికల వేళ

కాంగ్రెస్ కమిటీల

ప్రక్షాళన

- ఏడు జిల్లాలకు కొత్త అధ్యక్షులు
- 138 మంది ప్రధాన కార్యదర్శులు, 43 మంది ఉపాధ్యక్షులు

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకున్న వేళలోనే కాంగ్రెస్ పార్టీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఏకంగా పార్టీ కీలక కమిటీలను మార్పులు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఏడు జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రి కొత్త వారితో పలు కమిటీలు ప్రకటించారు. హావేరి జిల్లా అధ్యక్షుడిగా సంజీవ్‌కుమార్ నెరలంగి, కొప్పళ - అమరేగౌడ బయ్యాపుర, ఉడుపి - కిషన్‌హెగ్డే, రాయచూరు - బసవరాజ్ హిటగి, బళ్లారి సిటీ - ప్రశాంత్ అల్లం వీరభద్రప్ప, శివమొగ్గ - ఆర్. ప్రసన్నకుమార్, బెంగళూరు తూర్పు - కె. నందకుమార్‌ను నియమించారు. ప్రచార సమితి సహాయ ఉపాధ్యక్షుడిగా మాజీ మంత్రి పరమేశ్వరనాయక్‌ను ప్రకటించారు. ఎన్నికల వేళ క్రియాశీలకంగా లేని జిల్లా అధ్యక్షులను మార్చినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరినీ విస్మరించరాదని భా వించిన రాష్ట్ర పార్టీ జంబోటీమ్‌ను ప్రకటించింది. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా 138 మందిని, ఉపాధ్యక్షులుగా 43 మందిని నియమించింది. జిల్లాకు ఒకరిద్దరు చొప్పున ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను నియమిస్తారు. కానీ 30 జిల్లాలకు 138 మంది ప్రధాన కార్యదర్శులను నియమించడం చర్చనీయాంశమవుతోంది. కోశాధికారిగా వినయ్ కార్తీక్‌ను, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ విభాగం చైర్మన్‌గా రమేశ్‌బాబు, కో-చైర్మన్‌గా ఐశ్వర్య మహదేవ్, వైస్ చైర్మన్‌గా సత్యప్రకాశ్‌ను, సోషల్‌మీడియాకు కో-చైర్మన్లుగా విజయ్ మత్తికట్టి, నిఖేత్‌రాజ్‌మౌర్యను నియమించింది.

శ్రీవారికి విరులయాగం

- కనులపండువగా ఖాద్రీశుడి పుష్పయాగోత్సవం
- సంప్రోక్షణ అనంతరం గర్భాలయ ప్రవేశం చేసిన స్వామివారు
- ముగిసిన బ్రహ్మోత్సవాలు

కదిరి, ఏప్రిల్ 2: శ్రీసత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీవారికి పుష్పయాగోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ సంప్రోక్షణ, శుద్ధి, పరివార దేవతల అభిషేకం, గోపూజ, హోమాది కార్యక్రమాలు చేశారు. తరువాత యాగశాల నుంచి స్వామి వారి కుంభం, కలశాన్ని గర్భాలయ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారు.. భక్తులకు దర్శనమిచ్చారు.



రాత్రి తులసి, కురు, వేరు, కదిరి మల్లెలు, సంపంగి, మరువము, చామంతి, బేబి రోజా, సెంటు రోజా, గన్నేరు, నందివర్ధనం, కనకాంబరం తదితరాలతో పుష్పయాగోత్సవం నిర్వహించారు. స్వామివారు, భూదేవి, శ్రీదేవిఅమ్మవార్లను అలకంరించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పుష్ప యాగోత్సవంలో శ్రీవారు



పుష్పయాగోత్సవం కోసం తెప్పించిన పుష్పాలు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.45.22 లక్షలు

శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. బ్రహోత్సవాల్లో హుండీ ఆదాయం రూ.45.22 లక్షలు వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. లెక్కింపులో పర్యవేక్షణాధికారిగా రమేష్‌బాబు, ఆలయ సిబ్బంది, కెనరాబ్యాంకు మేనేజర్ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

కలిసి ముందుకెళదాం

- ఎన్టీయేను ఓడించడమే లక్ష్యం
- ఓట్లు చీలకుండా చూడాలి
- 'ఇండియా' కూటమి రాష్ట్ర ప్రతినిధుల తీర్మానం



ఐక్యత చాటుతున్న 'ఇండియా' కూటమి రాష్ట్ర ప్రతినిధులు


బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశానికి 'ఇండియా' కూటమి సారథ్యం అవసరమని, అందరం కలసి ముందుకెళదామని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కేపీసీసీ కార్యాలయంలో ఇండియా కూటమి రాష్ట్ర ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు, జాతీయ నేత పృథ్విరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, ఎన్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇనామ్‌దార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి క్లిష్టన్ డీ రోజోరియా, ఆర్‌జేడీ రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్ గుల్వాడి, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. మనపై ఉన్న నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఇండియా కూటమి తరపున పది పార్టీలతో కలసి ముందుకెళ్తున్నామన్నారు. మిత్రపక్షాలకు ఏమేరకు బలం ఉన్నదీ ముఖ్యం కాదని, మార్పుకోసం వారి తత్వ సిద్ధాంతాలు, వారు అనుసరిస్తున్న ప్రజా అనుకూల పోరాటాలు ముఖ్యమన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్-జేడీఎస్ కలసి పోటీ చేసినా తుమకూరులో సీపీఐ 17వేల ఓట్లు సాధించిందని, కానీ దేవెగౌడ 12వేల ఓట్ల తేడాతో ఓడిపోయారని గుర్తు చేశారు. ఓట్ల చీలిక జరగరాదని, సమష్టిగా ఎన్డీయేను ఓడించడమే ఏకైక లక్ష్యం కావాలన్నారు. కేంద్రప్రభుత్వం ప్రతిపక్షాలనేతలను దర్యాప్తు సంస్థల ద్వారా వేధిస్తోందన్నారు. చిన్నా, పెద్దా పార్టీ అనే తేడా లేకుండా కలసి ముందుకెళదామన్నారు. మతతత్వమే సర్వాధికారమనే పార్టీకి వ్యతిరేకంగా ప్రజాప్రభుత్వమే లక్ష్యమనే నినాదంతో ముందుకెళదామన్నారు. ఎన్నికల బాండ్ల విషయంలో బీజేపీ లెక్కలు చూపడం లేదని, కానీ ఐటీశాఖ కాంగ్రెస్‌కు నోటీసులు ఇచ్చిందని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీకి రూ.11 కోట్ల అంశంపై నోటీసులు ఇచ్చారన్నారు. సర్వే ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందని, అందరూ సహకరించాలన్నారు.

రాష్ట్రంలో అమిత్‌షాకు ఓటు అడిగే హక్కు లేదు

- కరువు నిధులు పైసా విదల్చలేదు
- వినతులు ఇచ్చినా బుట్టదాఖలు
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య



బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీవ్రమైన కరువు నెలకొన్నా, ఐదు నెలలక్రితం కరువు బృందాలు పర్యటించి నివేదికలు ఇచ్చినా కనీసం పైసా కూడా పరిహారం విడుదల చేయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. మైసూరులో సీఎం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ఉన్నతాధికారుల కమిటీకి అమిత్‌షా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో భీకరమైన కరువు ఉన్నా ఎందుకు నిధులు విడుదల చేయలేదని ప్రశ్నించారు. అక్టోబరు నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు రాష్ట్రం నుంచి వినతులు అందించామని తెలిపారు. కేంద్ర అధ్యయన బృందం ఇక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించిందన్నారు. డిసెంబరు 19న ప్రధానమంత్రిని, 20న అమిత్‌షాను కలిశానని పేర్కొన్నారు. ఇంతకాలమవుతున్నా కనీసంగా కూడా స్పందించడం లేదన్నారు. జీఎస్టీ వాటాలోనూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మండ్యలో కుమారస్వామి పోటీ దేవుడి కృప అంటూ వ్యాఖ్యానించడంపై గత ఎన్నికల్లో కుమారుడు నిఖిల్‌ను పోటీ చేయించడాన్ని ఏమని అర్థం చేసుకోలన్నారు. హాసన్‌లో తాను ప్రచారానికి వెళ్లకుంటే ప్రజ్వల్ రేవణ్ణ గెలిచేవారు కాదని గుర్తు చేశారు. హాసన్‌లో సమష్టిగా కాంగ్రెస్ నాయకులు పని చేసినందుకే విజయం సాధ్యమైందన్నారు. బెంగళూరులో డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ కరువు సాయం ఎందుకు ఇవ్వలేదో అమిత్‌షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఇఫ్తార్	: బుధవారం సాయంత్రం 6:33
సెహరి	: గురువారం ఉదయం 04:59



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,580.50	1,585.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	926	5,593
సామర్థ్యం (టీఎంసీలు)	4.72	7.58

ఓటుహక్కుతోనే సుస్థిర ప్రజాస్వామ్యం



ఓటరు జాగృతి ర్యాలీలో డీహెచ్ఓ డాక్టర్ వై.రమేష్

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 2: ప్రజాప్రభుత్వం ఏర్పాటులో ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వై.రమేష్ బాబు పేర్కొన్నారు. నగరంలోని మిల్లార్‌పేట ఆరోగ్య కేంద్రం వద్ద ఓటరు జాగృతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మే 7వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికలలో ప్రతిఒక్కరు తప్పకుండా ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలంటే ఎవరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగరాదని, సరైన అభ్యర్థిని ఎన్నిక చేయాలని అపుడే సుభద్రమైన ప్రజా ప్రభుత్వ వ్యవస్థ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ దానప్పవర్ అధికారుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి అబ్దుల్లా, మిల్లార్‌పేట ఆరోగ్య కేంద్రం పాలనాధికారి డాక్టర్ సౌజన్య, వైద్యాధికారి డాక్టర్ గీతా, సిబ్బంది శాంతమ్మ, మేఘరాజు, ఆరోగ్య మేరి, నేత్రా ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కురేకుప్పలో ఓటింగ్‌పై అవగాహన



అవగాహన జాతాలో అధికారులు, మహిళలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల ఓటింగ్‌పై మంగళవారం సండూరు తాలూకా కురేకుప్ప మున్సిపాలిటీ పరిధిలో అధికారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'మన ఓటు మా హక్కు, మన ఓటు అమ్మకానికి కాదు, మన ఓటు దేశానికి మంచిదని నినాదాలు చేశారు. జాతాలో మే 7న తప్పకుండా ఓటు వేయాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా కురేకుప్ప మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిపనుల తర్వాతే పోలింగ్ కేంద్రాలకు..

దేవలాపురం వద్ద ఉపాధికూలీలతో తాలూకా ఈవో



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంప్లి, ఏప్రిల్ 2: గ్రామాల్లో ఉపాధి కూలీలు తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తాలుకా ఈవో శ్రీకుమార్ తెలిపారు. మే నెల 7వ తేదీన జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో వారి ఓటును వినియోగించుకోవాలన్నారు. కూలీలు ఉపాధి పనులు చేసిన అనంతరం వచ్చి ఓటు వేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు, లొంగకుండా ఓటు హక్కును ధైర్యంగా వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో మల్లన్నగౌడ, పీడీవో శశికాంత్, ఉపాధి కూలీలు, తాలుకా పంచాయతీ సిబ్బంది అనుమేష, బాషా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గణిత పరీక్షకు 372 మంది గైర్హాజరు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 2: జిల్లావ్యాప్తంగా మంగళవారం జరిగిన ఎస్ఎస్ఎల్‌సి గణిత పరీక్షకు మొత్తం 20,898 మంది విద్యార్థులు హాజరుకాగా, 372 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఇందులో బళ్ళారి పూర్వవిభాగం నుంచి 134, సండూరు 53, సిరుగుప్ప 64, బళ్ళారి పశ్చిమ విభాగం నుంచి 121 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సార్వజనిక శాఖ అసిస్టెంట్ ఉమాదేవి తెలిపారు.

గనుల రాజ్యంలో ఘనుడెవరో?

పోటాపోటీగా శ్రీరాములు, తుకారామ్ ప్రచారం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 2: గనుల దోపిడీతో పాక్షికంగా ధ్వంసమైన బళ్లారి జిల్లాలో రాజకీయాలు విచిత్రంగా మారుతుంటాయి. ఒకప్పుడు ఒకరికి అనుకూలంగా ఉంటే కొంతకాలం తర్వాత వారికే ప్రతికూలంగా మారుతాయి. రెండువేల సంవత్సరానికి ముందు ఎం.వై. ఘోర్పడే, ఎంపీ.ప్రకాశ్, లాడ్ కుటుంబాల ఆదీనంలో ఉన్న బళ్లారి, మైనింగ్ పెరగడంతో గాలి జనార్దన రెడ్డి కోటగా మారింది. మైనింగ్‌తో పాటు రాజకీయంగా ఎదిగిన రెడ్డి కుటుంబం ఎవరు ఎంపీ కావాలో, ఎవరు ఎమ్మెల్యే కావాలో నియంత్రించే స్థాయికి చేరింది. ఆయన దెబ్బకు సూర్యనారాయణరెడ్డి, దివాకర్‌బాబు కుటుంబాలు కూడా అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాయి. కాలక్రమంలో జనార్దనరెడ్డి జైలుకు వెళ్లిన తరువాత ఆ ప్రాభవం తగ్గింది. రెడ్డి కేఆర్‌పీ పార్టీని ప్రారంభించి, ఎమ్మెల్యేగా గెలిచి ఆ పార్టీని మరలా బీజేపీలో విలీనం చేశారు. ప్రస్తుతం ఆయన మిత్రుడు శ్రీరాములు, మంత్రి సంతోష్‌లాడ్ సన్నిహితుడు తుకారాం ఇప్పుడు పరస్పరం తలపడుతున్నారు. మంత్రి నాగేంద్ర జనార్దనరెడ్డికి ఒకప్పుడు సన్నిహితుడుగా ఉండేవారు. నారాభరత్‌రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్‌సిటీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వీరంతా రెడ్డి ప్రత్యర్థి వర్గంలో చేరారు. జనార్దనరెడ్డి వర్గానికి చెందిన శ్రీరాములు, కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం పోటాపోటీగా ప్రచారం



చేసుకుంటున్నారు. తుకారాం గెలిస్తే మంత్రి నాగేంద్రకు, సంతోష్‌లాడ్‌కు ఊరట లభిస్తుంది. లేకుంటే జిల్లాలో జనార్దనరెడ్డి వర్గానిదే పైచేయిగా మారుతుంది. మరి ఎవరు గెలుస్తారో వేచి చూడాల్సిందే.

నగరంలో బీజేపీ అభ్యర్థి శ్రీరాములు ప్రచారం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 2 : బళ్లారి నగరంలో మంగళవారం హవంబావి, కుర్రట్టి, బసవనకుంట, కుంతి సర్కిల్, గుగ్గిరట్టి, వెంకటరమణ కాలనీ, ఏపీ



గుగ్గిరట్టి ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి శ్రీరాములు

ఎంసీ, బండిమోటు, బంగారప్ప కాలనీ తదితర ప్రాంతాల్లో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో శ్రీరాములు మాట్లాడుతూ మనదేశ ప్రధాని నరేంద్రమోడీ చేసిన అభివృద్దే తమ గెలుపుకు మార్గం చూపుతుందన్నారు. బీజేపీ హయాంలో బళ్లారి, విజయనగర జిల్లాలు ఎంతో అభివృద్ధి చెందాయని, బీజేపీ ప్రభుత్వంలో దశలు, దశలుగా ఎంతో అభివృద్ధి చేశామని శ్రీరాములు తెలిపారు. మే 7వ తేదీ జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటును కమలం గుర్తుకు వేసి తనను గెలిపించాలని నగరంలోని పలు వార్డుల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మరిన్ని పథకాలు అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు అనిల్ నాయుడు, ఎమ్మెల్సీ వైఎం సతీష్, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు బంగారు హనుమంతు, గుర్లింగనగౌడ, రాజన్న గౌడ, చెన్నప్ప, సొసైటీ బసవరాజు, మంజునాథ, ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు ఉమేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

13న సిరుగుప్పలో భారీ బహిరంగసభ

సిరుగుప్ప: సిరుగుప్పలో ఈనెల 13న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప తెలిపారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం బీజేపీ పార్టీ కార్యాలయంలో కొప్పాళ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ బసవరాజు ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 13న అచ్చొళ్లి, రావ్యాళ్, రారావి, సాయంత్రం సిరుగుప్ప పట్టణంలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున తాలుకా వ్యాప్తంగా వున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, జేడీఎస్ తాలుకా అధ్యక్షులు శివనారాయణ, సీనియర్ నాయకులు దొడ్డ హలిగప్ప, శేకన్న, బెళగల్ బసవరాజు, సుబ్బయ్య, మహదేవ, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సుకోబ్యాంక్ కస్టమర్లకు డిపాజిట్లపై వడ్డీ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 2:సుకోబ్యాంక్ ఈ ఏడాది ఏప్రిల్ 2024 నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేటును అందించనున్నట్లు బ్యాంక్ చైర్మన్ మోహిత్ మస్కీ చెప్పారు. నగరంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ 2023-24 సంవత్సరంలో రూ. 1114కోట్ల డిపాజిట్లను సేకరించి రూ. 6.23 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందన్నారు. ఇప్పటి వరకు 1828 కోట్ల రూపాయల లావాదేవీలు జరిపి, షెడ్యూల్డ్ బ్యాంకుగా రూపాంతరం చెందిందన్నారు. సహకార రంగంలో నమ్మకమైన బ్యాంకుగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. వ్యవసాయ రంగానికి 25శాతం రుణం ఇచ్చామని, బ్యాంకులోని 86మంది ఖాతాదారులు పిఎంఈజీపీ , 23మంది పీఎంఎఫ్‌మీఈ సౌకర్యాన్ని పొంది స్వయం ఉపాధిని ప్రారంభించారన్నారు. 11,901 మంది మహిళా వినియోగదారులకు రూ. 156కోట్ల రుణం పంపిణీ చేశామన్నారు. దీని ద్వారా మహిళా కస్టమర్లలో ఆర్థిక నైపుణ్యం పెరిగి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. తమ కస్టమర్ల కోసం, భీమా సౌకర్యాలను అందించడానికి బ్యాంక్ వివిధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుందని, కస్టమర్ల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నా మన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ మోహిత్ మస్కీ

తమ బ్యాంక్‌లో గత ఆర్థిక సంవత్సరంలో 38 మంది కొత్త అధికారులను నియమించామని, 40మంది అధికారులకు పదోన్నతులు కల్పించామన్నారు. బ్యాంక్ సిబ్బందికి రూ. 10లక్షల జీవిత భీమా, సిబ్బందికి వారి కుటుంబాలకు రూ. 4లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించామన్నారు. సుకో బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ రవిసుదాకర్, బోర్డు కార్యదర్శి విశ్వాలరావు, జనరల్ మేనేజర్ ఈశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు క్రమశిక్షణ అవసరం: ఐజీపీ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 2: పోలీసులు సమాజం పట్ల శ్రద్ద వహించాలని, పోలీసు సిబ్బందికి క్రమశిక్షణ, సంయమనం చాలా అవసరమని బళ్లారి మండల ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ లోకేష్‌కుమార్ అన్నారు. నగరంలోని



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

పోలీస్ పరేడ్ గ్రౌండులో మంగళవారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా దినోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాజంలో పోలీసులు చేస్తున్న సేవ ఎంతో అభినందనీయమన్నారు. పోలీసులు రోజువారీ పని ఒత్తిడితో ఉంటారని, ఒత్తిడిలో పని చేసే వారు ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ద వహించాలన్నారు. డ్యూటీతో పాటు కుటుంబానికి కూడా సమయం కేటాయించాలన్నారు. పదవీ విరమణ తర్వాత పూర్తిగా కుటుంబంతో గడపాలని సూచించారు. ముఖ్యఅతిగా పాల్గొన్న రిటైర్డ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ చన్నబసయ్య జెండా వందనాన్ని స్వీకరించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో పోలీసు సేవ అత్యంత కీలకమన్నారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్ బండారు మాట్లాడుతూ, కర్ణాటక ఏకీకరణ తర్వాత 1966 ఏప్రిల్ 2న కర్ణాటక పోలీసు చట్టం పరిధిలోకి కర్ణాటక పోలీసు బలగాలను తీసుకొచ్చారని, దానికి గుర్తుగా ప్రతి ఏటా రాష్ట్రంలోని అన్ని యూనిట్లలో జెండా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ రవికుమార్, నవీన్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అల్లం ప్రశాంత్



అల్లం ప్రశాంత్

బళ్లారి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బళ్లారి జిల్లా అధ్యక్షుడిగా అల్లం ప్రశాంత్ పగ్గాలు చేపట్టారు. అల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ(ఏఐసీసీ) సోమవారం రాత్రి జిల్లా అధ్యక్షుడిగా ఆయనను నియమించినట్లు ప్రకటించింది. అంతకు మునుపు జిల్లా అధ్యక్షుడుగా ఎస్. మహమ్మద్ రఫీక్ ఉండేవారు. ఆయన స్థానంలో ప్రశాంత్‌ను నియమించారు. ఆయన కుటుంబం ముందు నుంచి కాంగ్రెస్ పార్టీ విధేయులే. ఆయన అవ్వ అల్లం సుమంగళమ్మ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలివగా. ఆయన తాత కూడా రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. తండ్రి అల్లం వీరభద్రప్ప రెండు సార్లు ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ. ఎమ్మెల్సీగానూ పనిచేశారు. అల్లం వీరభద్రప్ప ఆరు నెలల క్రితం వరకూ ఎమ్మెల్సీగా ఉన్నారు. ప్రశాంత్‌ను అధ్యక్షుడిగా నియమించడం పట్ల పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

దిష్టిబొమ్మలా ఆర్వో ప్లాంటు



సోమప్ప కాలనీలో పనిచేయని ఆర్వో ప్లాంటు

కంప్లి, ఏప్రిల్ 2: కంప్లి తాలుకా పరిధిలోని సుగ్గినల్లి గ్రామంలో ఆర్‌వో ప్లాంటు దిష్టిబొమ్మలా మారింది. ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా అధికారులు, తాలుకా పంచాయతీ అధికారులకు, తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసినా కొందరు పీడీవోలు మాత్రం ఇది తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. సుగ్గినల్లి గ్రామం సోమప్ప కాలనీలోని ప్రజలు ఈ ఆర్‌వో ప్లాంటు శిథిలావస్థకు చేరుకోవడంతో పొరుగు గ్రామాలకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపైన ఎన్నిసార్లు గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ప్లాంటుకు త్వరలోనే మరమ్మతులు చేయించి తమకు నీటిని అందించకపోతే గ్రామ పంచాయతీ ముందు నిరసనకు దిగుతామని కాలనీ ప్రజలు హెచ్చరించారు.

విధుల్లో చేర్చుకోకపోతే పోరాటం

- ఆశా కార్యకర్త రాధ ఆవేదన



కంప్లి, ఏప్రిల్ 2 : తాలుకా పరిధిలోని శ్రీరామరంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుగ్గినల్లి గ్రామం 1వ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్త రాధ తనను డ్యూటీలోకి చేర్చుకోకపోతే శ్రీరామరంగాపురం ప్రాథమికేంద్రం ముందు ప్రతిఘటన చేపడతామని తెలిపారు. మంగళవారం శ్రీరామరంగాపురంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ 2009లో జూలై 5న తాము సుగ్గినల్లి 1వ కేంద్రంలో ఆశా కార్యకర్తలుగా ఉద్యోగాన్ని ప్రారంభించానని, కుటుంబంలో ఘర్షణ కారణంగా జూన్ 2వ తేదీ నుంచి నవంబరు 3 వరకు సెలవు తీసుకున్నానన్నారు. తిరిగి డిసెంబరు నుంచి తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విధులకు హాజరయ్యేందుకు వెళ్లగా, వైద్యులు డాక్టర్ రేవణ సిద్దప్ప తమకు విద్యార్హత లేదని విధుల్లోకి తీసుకోలేదన్నారు. తనను విధుల్లోకి తీసుకోకపోతే ప్రాథమిక కేంద్రం ముందే తమ కుటుంబసభ్యులు, పిల్లలతో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై డాక్టర్ రేవణ సిద్దప్పను విచారించగా రాధిక ఆరు నెలలుగా విధులకు హాజరుకాకపోవడంతో ఆమె ఇంటికి నోటీసు పంపామని, ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం తాము చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.10 పలుకుతున్న నిమ్మకాయ



కంప్లి, ఏప్రిల్ 2: మార్కెట్లో నిమ్మధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒక నిమ్మకాయ పది రూపాయిలు పలుకుతోంది. వ్యాపారస్తులు మార్కెట్లోకి నిమ్మకాయలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు లేక నిమ్మ పంటను పండించకపోవడంతో కాస్తో కూస్తో వచ్చిన పంటకు డిమాండ్ పెరిగి ధరలు కూడా పెరిగాయి. రోజురోజుకు నిమ్మ ధరలు పెరగడంతో వాటిని కొనడం కష్టంగా మారిందని వ్యాపారులు వాపోతున్నారు. ఎండవేడిమి పెరిగిపోవడంతో నిమ్మకాయకు ఎంతో ప్రాధాన్యం పెరిగిపోయింది. నీటిలో నిమ్మకాయ కలుపుకుని తాగి వేడిని తగ్గించుకునేందుకు ప్రతి ఇంటిలో దీనిని ఉపయోగిస్తారు. వేసవి ముందు ఎండలు ఎలా పెరుగుతున్నాయో నిమ్మ రేట్లు కూడా అలాగే పెరుగుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓటు హక్కుపై జనజాగృతి ర్యాలీ

సిరుగుప్ప, ఏప్రిల్ 2 :ఓటు వేయడం మన హక్కని తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ అన్నారు. సిరుగుప్ప పట్టణంలో మంగళవారం జిల్లా పంచాయతీ, ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ఓటు వేయడంపై జనజాగృతి ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రభుత్వాస్పత్రి వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలో 30వవార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటుహక్కు వినియోగించుకోవడం వల్ల దేశ భవిష్యత్తు మారుతుందని ఆయన తెలిపారు.

హోసూరు జోన్

పోలింగ్ బూత్‌ల తనిఖీ



పోలింగ్ బూత్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు (కృష్ణగిరి) ఏప్రిల్ 2: కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్‌బూత్‌లలో మౌలిక సదుపాయాలను జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ సరయు తనిఖీచేశారు. మంగళవారం కృష్ణగిరి పరిధిలోని పాతపెట్టి మున్సిపల్ హైస్కూల్, మున్సిపల్ మిడిల్ స్కూల్, భారత్ మెట్రిక్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఊత్తంగరై శాసనసభ నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాలు, బర్గూరు పరిధిలో 292, కృష్ణగిరి పరిధిలో 310, వేపనహళ్లిలో 312, హోసూరులో 382, తళిలో 305 పోలింగ్ కేంద్రాలు మొత్తం 6 శాసనసభ నియోజకవర్గాల్లో 1,888 పోలింగ్ కేంద్రాలున్నాయి. అన్ని బూత్‌లలో తాగునీరు, విద్యుత్, తగిన భద్రత, మరుగుదొడ్లు, దివ్యాంగులకోసం ప్రత్యేక ర్యాంప్‌లు కల్పిస్తున్నారు. కృష్ణగిరి మున్సిపాలిటి పరిధిలోని పాతపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 పోలింగ్ బూత్‌లు, ప్రభుత్వ మున్సిపాలిటీ మిడిల్ స్కూల్‌లో 2, భారత్ మెట్రిక్ స్కూల్‌లోని 5 పోలింగ్ బూత్ కేంద్రాల్లో మౌలిక వసతులను స్వయంగా పరిశీలించారు. కనీస సౌకర్యాలు లేని చోట్ల వెంటనే మరమ్మతులు చేయాలని కలెక్టర్ సరయు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కమిషనర్ సుబ్రహ్మణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

హోసూరు, ఏప్రిల్ 2: హత్య కేసులో నిందితుడికి కృష్ణగిరి కోర్టు జీవితఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. హోసూరు సమీపంలోని గొట్టిగెరె గ్రామానికి చెందిన శివరుద్రప్ప(34)కు అదే గ్రామానికి చెందిన రామకృష్ణన్(62)కు గ్రామంలోని 27 సెంట్ల భూమికి సంబంధించిన కేసు కొన్నేళ్లుగా డెంకణీకోట కోర్టులో నడుస్తోంది. ఇద్దరి మధ్య తరచూ ఈ భూమి విషయంలో గొడవలు జరిగాయి. 2018 డిసెంబర్ 11వ తేది రాత్రి మళ్లీ వారి మధ్య భూమి విషయంపై వాగ్వాదం జరిగింది. తర్వాత అది కొట్లాటగా మారింది. దీంతో కోపోద్రికుడైన శివరుద్రప్ప భూమి దున్నేందుకు ఉపయోగించే నాగలి కర్రు తీసుకుని రామకృష్ణ తలపై చితకబాదాడు. దాడిలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రామకృష్ణ కుమారుడు గాంధీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంచెట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని శివరుద్రప్పను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన కేసులో న్యాయమూర్తి రోస్లిన్ దురై మంగళవారం తీర్పు వెలువరించారు. నిందితుడు శివరుద్రప్పకు జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూటర్ చిన్నపిళ్ళప్ప వాదనలు వినిపించారు. పోలీసులు నిందితుడు శివరుద్రప్పను వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు

హోసూరు, ఏప్రిల్ 2: హోసూరు సమీపంలోని జూజువాడి ప్రాంతంలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోదాలు ముమ్మరం చేశారు. ఇక్కడ ఈనెల 19వ తేదీన పోలింగ్ జరగనుంది. అనుమతులు, సరైన రికార్డులు లేకుండా భారీ ప్రమాణంలో నగదు, బహుమతులు ఇతరత్రా రవాణా చేయకుండా అన్ని విధాలా కట్టడి చేశారు. కాగా సరిహద్దులోని బెంగళూరు జిల్లా ఆనేకల్ తాలూకా అత్తిబెలె వద్ద ఫ్లయింగ్ ఫోర్స్ వాహనాలు తనిఖీ చేశాకనే తమిళనాడులోకి వాహనాలను అనుమతిస్తున్నారు.



వాహనంలో సరుకును తనిఖీ చేస్తున్న పోలీసులు

నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధతతో కృషి

● రాయచూరు కాంగ్రెస్ అభ్యర్థి జి.కుమార్‌నాయక్



మాన్విలో కార్యకర్తలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కుమార్ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 2: ప్రభుత్వ ఉద్యోగిగా వివిధ శాఖల్లో సేవలందించిన తాను రాయచూరు లోకసభ నియోజక వర్గం అభివృద్ధి కోసం మరింత నిబద్ధతతో పని చేస్తానని లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ కుమార్ నాయక్ తెలిపారు. 30 ఏళ్ల తన అనుభవంలో ప్రజా సమస్యల పట్ల పరిపూర్ణమైన అవగాహన ఉందని పరిష్కారం కోసం తనవంతు పట్టుదలతో కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకం ఉంచి ప్రజా సేవ చేసేందుకు అవకాశం కల్పించిందన్న ఆయన రాయచూరు ప్రజలు తనను ఆశీర్వదించి సేవ చేసే అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. మంగళవారం ఆయన మాన్వి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకుపూర్వం మాన్వి పట్టణానికి చేరుకున్న కుమార్ నాయక్‌కు స్థానిక బసవేశ్వర సర్కిల్ వద్ద ఘన స్వాగతం లభించింది.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఉండాలి

రాయచూరు, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచాలని ఎస్పీ బి.నిఖిల్ ఆదేశించారు. జిల్లాలోని సింధనూరు, మాన్వి తాలూకాల పరిధిలో గల సరిహద్దు చెక్‌పోస్టులను మంగళవారం ఎస్పీ పరిశీలించారు. సింధనూరు సరిహద్దులు ఆంధ్రప్రదేశ్‌కు ఆనుకుని ఉండడంతో బయటి రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల పట్ల మరింత జాగ్రత అవసరమన్నారు. రాష్ట్రంలోకి ప్రవేశించే వాహనాల నెంబర్‌లను తనిఖీ చేయడంతో పాటు వాహనాన్ని పూర్తిగా పరిశీలించి అనుమతించాలన్నారు. ఎన్నికల సందర్భంగా మద్యం,నగదు పెద్ద ఎత్తున రవాణా అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాల తనిఖీ మరింత జాగ్రతగా సాగాలన్నారు. ఏ చిన్న అనుమానం వచ్చినా పూర్తి తనిఖీ చేయాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

స్వామి నారాయణ్ (జయంతి)



సహజానందస్వామిగా పేరొందిన స్వామినారాయణ్ 1781 ఏప్రిల్ 3న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్య సమీపంలో జన్మించారు. యోగి, సన్యాసిగా రాణించిన ఆయన ధర్మం, అహింస, బ్రహ్మచర్యంపై బోధనలు చేశారు. 11ఏళ్ల వయసులో తీర్థయాత్ర చేపట్టి గురువు రామానంద్ ద్వారా ఉద్ధవ్ సంప్రదాయంలో దీక్ష స్వీకరించారు. తన తత్వాన్ని అమలు చేసేందుకు 500 మంది పరమహంసలను నియమించాడు. సామాజిక సూత్రాలకు సంబంధించి శిక్షాపత్రిని రచించారు. 1830 జూన్ 1న కన్నుమూశారు.

శ్యామ్ మానెక్ షా (జయంతి)




'పద్మవిభూషణ్' గ్రహీత శ్యామ్ హార్మస్‌జీ ఫ్రాంజీ జంషెడ్‌జీ మానెక్ షా 1914 ఏప్రిల్ 3న పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో జన్మించారు. ఆర్మీలో నాలుగు దశాబ్దాలపాటు వివిధ హోదాలలో కొనసాగి 'చీఫ్ ఆఫ్ ది ఆర్మీస్టాఫ్'గా వ్యవహరించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ ఆక్రమిత దళాలను తిప్పికొట్టడంలో కీలకంగా వ్యవహరించారు. 1971లో ఇండో-పాక్ యుద్ధంలో ప్రదర్శించిన వ్యూహ చతురత, బుద్ధికుశలత అమోఘమైనవి. దేశ అత్యున్నతమైన తొలి ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి సాధించారు. 94వ యేట 2008 జూన్ 27న కన్నుమూశారు.

మార్లన్ బ్రాండో (జయంతి)



మార్లన్ బ్రాండో 1924 ఏప్రిల్ 3న జన్మించారు. అమెరికాకు చెందిన నటుడు, దర్శకుడు. 60ఏళ్ల సినీ కెరీర్‌లో 20వ శతాబ్దంలో ఎంతో ప్రభావితుడిగా నిలిచారు. అకాడమీ అవార్డు ఫర్ బెస్ట్ యాక్టర్‌ను రెండు సార్లు అందుకున్నారు. మానవహక్కుల కోసం కూడా పాటుపడ్డారు. అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌చే నాల్గవ గ్రేటెస్ట్ మూవీ స్టార్‌గా నిలిచారు. టైమ్ జాబితాలో యాక్టర్ ఆఫ్ ది సెంచరీగా నిలిచారు. 2004 జూలై 1న కన్నుమూశారు.

ఆది గోద్రెజ్ (పుట్టినరోజు)



ఆది బుర్జోర్జి గోద్రెజ్ 1942 ఏప్రిల్ 3న ముంబైలో జన్మించారు. దేశంలో పేరొందిన వ్యాపార దిగ్గజం, పారిశ్రామికవేత్త. గోద్రెజ్ గ్రూప్ ఛైర్మన్, గోద్రెజ్ కుటుంబానికి పెద్దదిక్కు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు ఛైర్మన్‌గా, కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీకి అధ్యక్షుడిగా వ్యవహరించారు. నిత్యావసర వస్తువుల మార్కెటింగ్‌లో దేశంలో సత్తా చాటారు. సామాజిక బాధ్యతలో భాగంగా విద్య, వైద్య, పర్యావరణ రంగాలలో చేయూతనిస్తున్నారు.

హరిహరన్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత హరిహరన్ 1955 ఏప్రిల్ 3న త్రివేండ్రమ్‌లో జన్మించారు. నేపథ్య గాయకుడిగా రాణించారు. పలు భాషలలో పాటలు పాడారు. ప్రత్యేకించి భజనలు, గజల్స్‌తోపాటు తమిళ, హిందీ భాషలలో పలు ప్రైవేట్ ఆల్బమ్స్ విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ నేతృత్వంలో పలు పాటలు పాడారు. రెండు జాతీయ, పలు రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నారు. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 2021లో గుల్షన్ కుమార్, హరిహరన్‌ల హనుమాన్ చాలీసాను టి సిరీస్ విడుదల చేయగా యూట్యూబ్‌లో 2 బిలియన్‌ల మంది చూడడం ఒక రికార్డుగా నిలిచింది.

జయప్రద (పుట్టినరోజు)



జయప్రద 1962 ఏప్రిల్ 3న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. అసలు పేరు లలితా రాణి. తెలుగు, తమిళ, మళయాళ, కన్నడ, హిందీ భాషలలో పలు సినిమా లలో నటించారు. నంది అవార్డు, మూడు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలతోపాటు పలు అవార్డులు అందుకున్నారు. లోక్‌సభ సభ్యురాలిగా వ్యవహరించారు. సినిమాలకు గుడ్‌బై చెప్పి రాజకీయాల్లో, బుల్లితెరపై రాణిస్తున్నారు.

నోరూరిస్తున్న చింతచిగురు



చింతచిగురు

బాగేపల్లి, ఏప్రిల్ 2: ఉగాది పర్వదినానికి చింతచెట్లు చిగురించి ఉంటాయి. పండుగ సమీపిస్తున్న తాలూకాలో ఇప్పటికే పనస, వేపచెట్లు చిగురించాయి. ప్రధానంగా చింతచిగురుకు డిమాండ్ ఉంది. తాలూకాలో ఎక్కువగా పనస, మామిడి, వేప, చింతచెట్లు ఉన్నాయి. అటవీ ప్రాంతంతోపాటు రైతుల పొలాల్లో భారీగా చెట్లు ఉన్నాయి. ప్రధానంగా చింతచెట్లు ఎక్కువగా ఉన్నాయి. సీజన్‌లో వచ్చే చింతపండుకు డిమాండ్ ఉన్న రీతిలోనే చింత చిగురుకు కూడా ఆదరణ ఉంది. తాలూకాలోని యల్లంపల్లి, గంట్లమల్లమ్మ లోయ, వండమాన్ బ్యారేజ్ తదితర ప్రాంతాల్లో చింతచెట్లు అధికంగా పెంచారు. రెండు మూడు రోజులుగా చింత చిగురును పట్టణంలోకి తెచ్చి విక్రయిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రజలు సైతం చింతచిగురుపట్ల ఆసక్తిగా చూపుతూ కొనుగోలు చేస్తున్నారు. కాగా కొన్ని చోట్ల రోడ్డుపక్కన ఉన్న చెట్ల నుంచి చింతచిగురును కోసుకోవడం సామాన్యంగా ఉంది. ఏడాదికోసారి వచ్చే చింత చిగురుకు డిమాండ్ ఉంది.

ఓటరు జాగృతి కోసం నలుగురు రాయబారులు

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు పరిధిలో ఓటరు జాగృతి కోసం నమ్మ బెంగళూరు రాయబారులుగా నలుగురిని నియమించారు. ఈమేరకు మంగళవారం యువ ఓటర్లతో టౌన్‌హాల్‌లో ప్రత్యేక సమావేశం జరిపారు. రాయబారులుగా నటుడు, దర్శకుడు రమేశ్ అరవింద్, నటి, మోడల్ నీతూ వనజాక్షి, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అనూప్ శ్రీధర్, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి అర్చనా జీ కామత్‌లను నియమించినట్టు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ప్రకటించారు. ఈమేరకు ఓటు హక్కు వినియోగించుకోవడంపై యువతకు అవగాహన కల్పించారు.



మొబైల్ టార్చ్‌లైట్‌లతో యువత



కార్యక్రమంలో బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయండి

బంగారపేట, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని ఎస్పీ శాంతరాజు పిలుపునిచ్చారు. తాలూకాలోని అతి సున్నిత ప్రాంత బూత్‌లుగా గుర్తించబడిన దొడ్డవలగమాది, హనుకుంద, మల్లెంగుర్కి, డీకేహళ్ళి తదితర గ్రామాలలో మంగళవారం ఓటుహక్కుపై జాగృతి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది ఎంతో కీలకమైనదని, తద్వారా సరైన నాయకుడిని ఎన్నుకోవడం మనబాధ్యత అన్నారు. ప్రజలంతా ఓటుహక్కు వినియోగించుకోవడం ద్వారా వందశాతం పోలింగ్‌కు సహకరించాలన్నారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ ఎన్నికల్లో అందరూ క్రియాశీలకంగా ఉండి ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో సహాయక ఎన్నికల అధికారి శివకుమార్, తహసీల్దార్ రశ్మి, తాలూకా పంచాయతీ ఈఓ రవి కుమార్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎస్పీ శాంతరాజు

నకిలీ హిందూత్వవాదుల నుంచి పాఠాలు అవసరం లేదు

బీవై రాఘవేంద్ర

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఒకసారి అభ్యర్థిని ప్రకటిస్తే అది అధికారికమవుతుందని శివమొగ్గ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీవై రాఘవేంద్ర అభిప్రాయపడ్డారు. నాగూర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూత్వమనేది మా రక్తంలోనే ఉందని, దేశంలో నివసిస్తున్నవారంతా హిందువులేనన్నారు. నకిలీ హిందూత్వవాదులనుంచి తాము పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ అధికారికంగా శివమొగ్గ లోక్‌సభ అభ్యర్థిని ప్రకటించిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మా నియోజకవర్గంలో క్యాంపెయిన్ చేశారన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలంతా తోడుగా ఉన్నారన్నారు. తమలోని హిందూత్వ గురించి చూపించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఉదాహరణకు బీఎస్ యడియూరప్ప కూడా రామజన్మభూమి పోరాటంలో పాల్గొన్నారని, కరసేవకులుగా పనిచేశారన్నారు. హుబ్బళ్ళి ఈద్గా మైదానంలో త్రివర్ణ పతాకం ఎగురవేశారని, అలాగే కశ్మీర్ లాల్‌చౌక్‌లోనూ జాతీయపతాకం ఎగురవేశారన్నారు. యడియూరప్ప ముఖ్యమంత్రిగా గోవధ నిషేధానికి ఎలాంటి చర్యలు చేపట్టారో అందరికీ తెలుసునన్నారు. బాలికలకోసం చేపట్టిన భాగ్యలక్ష్మి పథకం ఎంతో ప్రజాదరణ పొందిందన్నారు. ప్రముఖులైన వాల్మీకి, కనకదాస జయంతిలను ఆచరించేలా చేపట్టారన్నారు. ఓట్లకోసం హిందూత్వంపై ప్రచారం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాగా ఈశ్వరప్ప రెండువారాలలోనే ఎందుకిలా వ్యాఖ్యానించారో ప్రజలు గమనిస్తున్నారన్నారు.

అశోక్ ఇన్‌చార్జ్‌గా మాకొద్దు

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రతిపక్షనేత అశోక్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించడంపై స్థానిక నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. అశోక్‌ను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు కృష్ణప్ప, మునిరత్నలు అగ్రనాయకులకు ఫిర్యాదు చేశారు. ఒప్పందపు రాజకీయాలు చేసే అశోక్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించరాదని డిమాండ్ చేశారు. డీకే శివకుమార్, డీకే సురేశ్ సోదరులకు గుణపాఠం చెప్పే ఎన్నికల్లో సమర్థవంతమైన ఇన్‌చార్జ్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం పార్టీ ముఖ్యనేతలకు పరిస్థితి వివరించినట్టు తెలుస్తోంది. ఏడాదిక్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో కనకపుర అభ్యర్థిగా అశోక్ పోటీ చేసి కనీసం డిపాజిట్ సాధించలేదని, ఆయనకు మరోసారి ఇన్‌చార్జ్‌గా నియమిస్తే ప్రత్యేకంగా ఒనగూరేది లేదని అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దీంతో పార్టీ నేతలు పునరాలోచనలో పడ్డారు.

సమన్వయ సమావేశానికి మునిస్వామి మద్దతుదారులు గైర్హాజరు

బంగారపేట, ఏప్రిల్ 2: కోలారు లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్-బీజేపీ మైత్రి అభ్యర్థి ఎం మల్లేశ్‌బాబు ఈనెల 4న నామినేషన్ వేయనున్న నేపథ్యంలో బంగారపేట కృషిక సమాజ భవనంలో మంగళవారం ఏర్పాటైన సమన్వయ సమితి సమావేశానికి సిట్టింగ్ ఎంపీ మునిస్వామి మద్దతుదారులు గైర్హాజరయ్యారు. కోలారు టిక్కెట్‌ను ఆశించిన మునిస్వామికి దక్కకపోవడంపై ఆయన మద్దతుదారుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ అసంతృప్తులను నచ్చచెప్పేందుకు సమన్వయ సమితి నేతృత్వంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. అయితే మునిస్వామి మద్దతుదారులు రాలేదు. ఆయన మద్దతుదారుల్లో ప్రముఖులైన కపాలి శంకర్, సూలికుంటె శ్రీనివాసగౌడ, సోరే గౌడనకోటె హోసరాయప్ప, వెంకటేశరెడ్డి తదితరులు పాల్గొనలేదు. బీజేపీ ప్రముఖులు బీపీ వెంకట మునియప్ప, కే చంద్రారెడ్డి, శివకుమార్, సంపంగిరెడ్డి, బీవీ మహేశ్, జేడీఎస్ ప్రముఖులు మునిరాజు, వడగూరు హరీశ్ తదితరులు పాల్గొని ఈనెల 4న నామినేషన్ వేసే ఎం మల్లేశ్‌బాబు కార్యక్రమానికి హోబళి లవారీగా కార్యకర్తలను రప్పించే విషయమై చర్చించారు. మొత్తమ్మీద అసంతృప్తులను బుజ్జగించే ప్రక్రియ చురుగ్గా సాగింది.



సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు

రాష్ట్రంలో ఇకపై జేడీఎస్ ఉండదు

కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇకపై జేడీఎస్ ఉండదని ఆ పార్టీ నేతలు కాంగ్రెస్‌లోకి పెద్దసంఖ్యలో వస్తారని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ జోస్యం చెప్పారు. ఎవరు మైత్రి ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేశారో వారితోనే ఒప్పందం చేసుకున్నారని, ఇంతటి నీచమైన రాజకీయాల్లో ఉండలేమనే జేడీఎస్ కార్యకర్తలు విసుగు చెందుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. చిక్కబళ్ళాపుర, కోలారు ప్రాంతాలకు చెందిన జేడీఎస్ నాయకులు మంగళవారం పార్టీలో చేరిన సందర్భంగా సాదరంగా ఆహ్వానించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్కలిగలకు ఎక్కువ సీట్లు ఇచ్చిందని, జేడీఎస్ కేవలం కుటుంబీకులు మాత్రమే బరిలో ఉన్నారన్నారు. జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే కేపీ బచ్చేగౌడ, శిడ్లఘట్ట నాయకుడు పుట్ట ఆంజనప్పతోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న డీకే శివకుమార్

వైద్య సేవల నుంచి ప్రజాసేవకు వస్తున్నా

ఆశీర్వదించండి

బీజేపీ అభ్యర్థి డాక్టర్ మంజునాథ్

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా డాక్టర్‌గా సేవలందించిన వేళ వైద్యం ముందు ఫీజు తర్వాత అనే విధానం పాటించానని, ప్రస్తుతం ప్రజాసేవకు వస్తున్న తనను ఆశీర్వదించాలని బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మం జునాథ్ ఓటర్లను కోరుతున్నారు. శక్తి కేంద్ర ప్రముఖుల సభలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళ పాటు డాక్టర్‌గా పేదప్రజల ఆరోగ్యం కాపాడే విష యంలో నిబద్ధతతో పనిచేశానని ప్రస్తుతం రాజకీయాల ద్వారా మరింత సేవ చేయదలచినట్లు పేర్కొన్నారు. నిజమైన పేదరికం చూడాలంటే రైలులో ప్రయాణించాలని ప్రాంతాల వారిగా ఎన్నో ప్రజాసమస్యలు తెలుసుకోవచ్చు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బెంగళూరు అభివృద్ధికి కట్టుబడ్డారని కెంపేగౌడ ఎయిర్ పోర్టులో రెండోటర్మినల్ అంతర్జాతీయ స్థాయిలోనే అద్భు తమనే పేరొచ్చిందన్నారు. ప్రభుత్వాన్ని ఎవరైనా నడుపుతారు పాలన చేయడం ముఖ్యమన్నారు. గ్రాంట్‌లు తీసుకువచ్చి అభివృద్ధి చేసే ఆలోచనతో రాజకీయాలలోకి వచ్చానని పేర్కొన్నారు. ప్రచారంలో విశేష అభిమానం చూపుతు న్నారని గెలుస్తాననే నమ్మకం వచ్చిందని తెలిపారు. గుండె పోటు అనేది కేవలం శ్రీమంతులకే కాదని అన్నివర్గాలకు వస్తోందని, ఒకప్పుడు గుండె ఆపరేషన్‌కు వాడే స్టెంట్ రూ.75వేలు ఉండేదని ప్రస్తుతం మోదీ ప్రభుత్వంలో రూ.25వేలకు తగ్గిందని వివరించారు.

ఎన్నికలు బహిష్కరిస్తామని గ్రామస్థుల హెచ్చరిక



రోడ్డు దుస్థితిపై గ్రామస్థుల నిరసన

మౌలిక సదుపాయాలు లేవని చిక్కమగళూరు జిల్లాలో నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మా పల్లెకు రోడ్డు లేదు, ఓ ఇంటికి పత్రం లేదని ఎంతోకాలంగా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని చిక్కమగళూరు జిల్లా ఎన్ఆర్‌పుర తాలూకా జక్కనక్కి గ్రామస్థులు ఎన్నికలు బహిష్కరిస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. గడిచిన శాసనసభ ఎన్నికలకు ముందు ఇదే తరహాలో ప్రకటించామని అప్పట్లో తహసీల్దారు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఏడాది కావస్తున్నా పట్టించుకోలేదన్నారు. 2015లో రోడ్లకు కంకర వేశారని, ఆ తర్వాత మట్టిగానీ, డాంబరుగానీ వేయలేదన్నారు. గ్రామంలో తాగునీటికి సమస్య ఉందని, మురుగు కాలువలు లేవని మండిపడ్డారు. సమస్య పరిష్కారం కాకుంటే ఓట్లు వేసేది లేదని తేల్చిచెప్పారు. స్థానికంగా ఈ విషయం కలకలం రేపింది. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ప్రజలు తిరిగి తమ నిర్ణయాన్ని మార్చుకుంటారా అనేది ఆసక్తికరంగా మారింది. ఏదేమైనా కనీ సదుపాయాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు విఫలం చెందడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జలసంరక్షణ అందరి బాధ్యత

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జలసంరక్షణ, సమగ్ర నీటి నిర్వహణ విధానాలు అందరి బాధ్యత కావాలని హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఉన్నతాధికారి ఆశిశ్ ఘట్నేకర్ తెలిపారు. విశ్వజల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 80 చిన్న, మధ్య చెరువులను పునఃనిర్మించినట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. చెరువులలో నీటిని నిల్వ చేయడం ద్వారా పశుపక్ష్యాదులు, జలచరాల మనుగడ సాధ్యమన్నారు. అంతేకాక నీటిమట్టం పెరగనుందన్నారు. ఉత్తరకన్నడ జిల్లా ముండగోడ తాలూకా దొడ్డకెరెను అభివృద్ధి చేసినట్టు ప్రకటించారు.

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

మడకశిరటౌన్, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున క్షేత్ర స్థాయిలో ఎన్నికల నియమావళి అమలయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత స్థానిక అధికారులపై ఉంటుందని ఆర్ఓ గౌరీశంకర్ అన్నారు. ఆయన మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో నియోజకవర్గం స్థాయి అధికారులు, వీఆర్ఓలు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు పబ్లిక్ ప్రాంతాల్లో, స్తంభాలపై ఉండకూడదన్నారు. వారి సొంత ఇళ్లపై పార్టీ జెండా కట్టినా అభ్యంతరం ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. నియమావళికి సంబంధించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.

మల్లేశ్వరస్వామికి విశేష పూజలు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 2: తాలూకాలోని భూదళి గ్రామంలో వెలసిన మల్లె మల్లేశ్వరస్వామికి సోమ, మంగళవారాలలో రెండు రోజులపాటు విశేషపూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయ శుద్ధి అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వపత్రంతో, తులసి, పుష్పాలతో అభిషేకం చేశారు. 9 గంటలకు మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. 11 నుంచి 4వరకు స్వామివారికి వివిధసేవలు నిర్వహించారు. రెండోరోజు మంగళవారం స్వామివారికి ఓం నమఃశివాయ అంటూ మంత్రపుష్పం సమర్పించారు. విశేష అలంకరణ, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్యేకపూజల్లో వందలాదిమంది భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులయ్యారు.



జాతీయ ఈత పోటీల్లో పీఈఎస్ విద్యార్థికి బంగారు బహుమతి

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్సిటీ బీకామ్ విద్యార్థి నవీన్ వెంకటేశ్ 23వ జాతీయ ప్యారా స్విమ్మింగ్ చాంపియన్స్‌లో బంగారు పతకాన్ని సాధించారు. 100, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50 మీటర్లలో బ్యాక్ స్ట్రోక్‌లో 1 బంగారు, 2 వెండి పతకాలు సాధించారు. మార్చి 28 నుంచి 29వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో పోటీలు జరిగాయి. విజేత నవీన్‌ను నగరంలో మంగళవారం ప్రత్యేకంగా సత్కరించారు. పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ దొరస్వామి అభినందించారు.



ట్రోఫీతో నవీన్ వెంకటేశ్

పొదుపు సొమ్ముకు ఎసరు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2: పొదుపు మహిళలు కష్టపడి దాచుకున్న సొమ్ముపై ప్రభుత్వం కన్నేసింది. సమాఖ్య డబ్బును సిబ్బంది జీతాలకు మళ్లించాలని చూస్తోంది. 'సెర్ప్' పరిధిలోని డీఆర్‌డీఏ-వైకేపీ అమలు చేస్తున్న రైతు సాధికార సంస్థలో (ఆర్‌వైఎస్ఎస్) సుమారు 60 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి రెండేళ్లుగా వేతనాలు చెల్లించలేదు. బకాయి వేతనాలతో పాటు మరో ఏడాదికి కలిపి మొత్తం రూ.7.2 కోట్లు కాజేసేందుకు యత్నిస్తున్నారు. ఇదంతా అక్కా చెల్లెమ్మలకు సంబంధించిన సొమ్ము కావడం గమనార్హం. ఇప్పటికే మండల సమాఖ్యల ద్వారా నిధులు సేకరించి, రైతు సాధికార సంస్థ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని సెర్ప్ ఆదేశించినట్టు సమాచారం. దీనికి ఏపీఎంలు అంగీకరించక పోవడంతో డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. మండల సమాఖ్యల నిధులను వేతనాలకు మళ్లిస్తే.. తిరిగి ఆ నిధులు ఎప్పుడు వస్తాయని సమాఖ్య మహిళలు ప్రశ్నిస్తున్నారు.

సేంద్రియం పేరుతో..

డీఆర్‌డీఏ-వైకేపీ పరిధిలోని మండల సమాఖ్యల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేలా ఒప్పందం చేసుకున్నారు. డీఆర్‌డీఏ-వైకేపీ, రైతు సాధికార సంస్థతో పాటు స్త్రీనిధిని ఎంఓయూలో భాగస్వామిగా చేశారు. పేద డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి నుంచి రుణాలు అందిస్తున్నారు. ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్ట్ అమలుకు అవసరమైన నిధులను స్త్రీనిధి నుంచి 11 శాతం వడ్డీతో రైతు సాధికార సంస్థకు రుణం ఇస్తారు. ఆ సంస్థకు నిధులు వచ్చిన తరువాత స్త్రీనిధికి తిరిగి చెల్లిస్తారు. రైతు సాధికార సంస్థ చెల్లించని పక్షంలో మండల సమాఖ్యల వద్ద ఉండే సీఐఎఫ్ నిధుల నుంచి స్త్రీనిధి సంస్థ రికవరీ చేసుకుంటుంది. మొత్తంగా.. రైతు సాధికార సంస్థ రుణం తిరిగి చెల్లించకుంటే నష్టపోయేది పొదుపు మహిళలే. సేంద్రియ వ్యవసాయం అమలు చేస్తామంటూ రైతు సాధికార సంస్థ ఒప్పందం చేసుకోవడం తమకు ఇబ్బందికరంగా మారిందని డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సీఎం సభలకు విచ్చలవిడిగా సీఐఎఫ్ నిధులు ఖర్చు చేస్తుండటంతో డీఆర్‌డీఏ-వైకేపీ మండల కార్యాలయాల నిర్వహణ భారమవుతోంది.

ఒత్తిడి చేయడం లేదు

మండల సమాఖ్యల నుంచి రైతు సాధికార సంస్థ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సెర్ప్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమే. అయితే మండల సమాఖ్యలపై ఎటువంటి ఒత్తిడి లేదు. ఆసక్తి, నిధులు ఉన్న మండల సమాఖ్యలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో వేరే ఉద్దేశం లేదు. సిబ్బందికి వేతనాలు ఇచ్చిన తరువాత, ప్రభుత్వం నిధులు ఇచ్చిన వెంటనే వడ్డీతో కలిపి మండల సమాఖ్యలకు నిధులు చెల్లిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ

ఫోర్టిస్‌లో సర్వైకల్ కేన్సర్‌కు చికిత్స

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సర్వైకల్ కేన్సర్‌తో బాధపడుతున్న 55ఏళ్ల మహిళకు బన్నేరుఘట్ట రోడ్డులోని ఫోర్టిస్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స విజయవంతం చేశారు. ఆసుపత్రి వైద్యనిపుణుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన మేరకు అనంతపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు నగరంలోని పలు ఆసుపత్రులలో చికిత్సలు పొందారన్నారు. 55ఏళ్ల మహిళ రుతుక్రమం ఆగిపోయి రక్తస్రావం వంటి సమస్యతో కొంతకాలంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. ఫోర్టిస్‌ను సంప్రదించగా శస్త్ర చికిత్సకు బదులు అత్యాధునిక రేడియేషన్ థెరపీ ద్వారా నయం చేశామన్నారు. 65ఏళ్ల మహిళకు అండాశయాలు తొలగించి ఆపరేషన్ చేశామన్నారు. 74ఏళ్ల వృద్ధురాలికి కడుపు ఉబ్బడం, బరువు తగ్గడం, బలహీనత వంటి లక్షణాలతో ఉన్న మహిళకు చికిత్స చేశామన్నారు. కడుపులో కణితి తొలగింపు, కేన్సర్ కణాలను చంపే కీమోథెరపీ అమలు చేశామన్నారు. ఈమెకు 12గంటలపాటు వైద్యచికిత్సలు అందించామన్నారు. ముగ్గురూ కోలుకున్నారన్నారు.